క్లుప్తంగా

శామ్యూల్ జార్జికి మాజీ మంత్రి సురేష్ నివాళి



జార్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ సురేష్

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తన తండ్రి, జార్జి విద్యా సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదిమూలపు శామ్యూల్ జార్జి వర్ధంతిలో పాల్గొని ఘన నివాళులర్పించారు. హైదరాబాద్‌లోని సురేష్ నివాసంలో జరిగిన కార్యక్రమంలో శామ్యూల్ జార్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు మసనం వెంకట్రావు, జిల్లా కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ సాబీర్‌బాషా, మండల యువజన విభాగం అధ్యక్షుడు కోమిట్ల వెంకారెడ్డి, నాగార్జునరెడ్డి, భాను, నరేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య నిలయాలు

సీఎస్‌పురం(పామూరు): అంగన్‌వాడీ కేంద్రాలు ఆరోగ్య నిలయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళారెడ్డి అన్నారు. మండలంలోని డీజీపేటలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషన్ మాసం కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా సరళారెడ్డి మాట్లాడుతూ పోషన్ మాసం 17వ తేదీ నుంచి వచ్చే నెల 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం గర్భిణులకు, బాలింతలకు చిన్నపిల్లలకు ఎంతో ఉపయోగకరం, ఆరోగ్యకరమన్నారు. పోషకాహార విలువలతో కూడిన వంటకాలపై చార్టుల ద్వారా వివరించారు.

పాఠశాల అభివృద్ధికి రూ.10 వేలు అందజేత

పీసీపల్లి: మండల పరిధిలోని వెంగళాయపల్లి పాఠశాల అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన ఏరువ చెంచయ్య రూ.10 వేలను ఎంఈఓ ఆర్ శ్రీనివాసచారి, సంజీవ్ చేతుల మీదుగా ప్రధానోపాధ్యాయుడికి అందజేశారు. సర్పంచ్ కరణం తిరుపతయ్య, స్వర్ణ రమణయ్య, మాధవరావు, రంగనాయకులు, విద్యా కమిటీ చైర్మన్ వీరాంజనేయులు, గోద్రెజ్, లక్ష్మిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భైరవకోన హుండీ ఆదాయం రూ.5.39 లక్షలు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోన భైరవేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం భైరవకోన ఆలయ హుండీ లెక్కింపు కార్యక్రమం దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పర్యవేక్షణలో, ఆలయ కార్యనిర్వాహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. 6 నెలల 10 రోజులకు రూ.5,39,521 ఆదాయం వచ్చినట్లు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి తెలిపారు. లెక్కింపులో ఎం వెంకటరాజు, ముప్పాళ్ల నాగేష్, రాజేంద్ర, అర్చక బృందం, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

టంగుటూరు: జిల్లాలో అవసరమైన మేరకు ఎరువులు నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి యుగంధర్ రెడ్డి అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఎరువులు కావాల్సిన రైతులు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించాలన్నారు. బెజవాడ వెంకటేశ్వర్లు, వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు సుభాషిణి, దివ్య, చందుకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై విచారణ



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసరావు

సింగరాయకొండ: మండలంలోని పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లెక్కలు ఉపాధ్యాయుడు సిద్దు వెంకట నాగ ప్రసాద్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సోమవారం ఎంఈఓ శ్రీనివాసరావు పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుడు పాఠాలు నేర్పకుండా అశ్లీల చిత్రాలు చూపిస్తూ విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడన్న ఆరోపణలు రావటంతో ఆయన విద్యార్థినులను విచారించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపనున్నట్లు ఎంఈఓ శ్రీనివాసరావు వివరించారు.

- కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలు అంతంత మాత్రమే
- అటకెక్కిన పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు, పక్కా గృహాలు
- కనీస అవసరాలు తీర్చేవారు లేక ప్రజల అవస్థలు

ప్రచారం ఎక్కువ.. ఫలితం తక్కువ!



పథకాల కోసం మీ కోసంలో అర్జీలు సమర్పిస్తున్న అర్హులు



ఇంకా గ్రామాల్లో దర్శనమిస్తున్న పూరిళ్లు

పొన్నలూరు:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు. చంద్రబాబు, టీడీపీ నాయకులు చేసే ప్రచారానికి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలకు ఎక్కడా పొంతన కుదరడం లేదు. ప్రభుత్వం ప్రచారం చేసుకుంటున్న విధంగా వారు అమలు చేసే అరకొర సంక్షేమ పథకాలు అర్హులకు దక్కడం లేదు. ప్రజల అభివృద్ధే ధ్యేయమంటూ ఉపన్యాసాలు ఇచ్చే చంద్రబాబు మాటలు కోటలు దాటుతున్నా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అరకొర పథకాలు కూడా ప్రజలకు అందక అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు అవుతున్నా గ్రామాల్లో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే అధికారులు పింఛన్లు, కొత్త రేషన్ కార్డులు, అరకొర ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారు. పారదర్శకంగా వ్యవహరించాల్సిన అధికారులు కూడా టీడీపీ నాయకులు చెప్పిన మాటలు వింటూ వారి అనుయాయులకు అందజేస్తున్నారు.

అర్హులకు మొండిచెయ్యి

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నరకు పైగా అవుతున్నా ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన ఏ ఒక్క పథకం కూడా సక్రమంగా పూర్తిస్థాయిలో ప్రజలకు అందలేదు. పథకాలు ప్రారంభించిన తర్వాత తూతూ మంత్రంగా అమలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. చంద్రబాబు ప్రచార ఆర్భాటంలో చూపిన శ్రద్ధ పథకాలను ప్రజలకు అందించడంలో చూపలేక పోయారు. ఈ ఏడాది కాలంలో మండలంలో కనీసం ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరైన ఇళ్లకు మిగిలిన పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. వీటిని కూడా పూర్తిస్థాయిలో నిర్మించిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వంలో సగం వరకు నిర్మించిన గృహాలకు కూడా కూటమి ప్రభుత్వం సకాలంలో బిల్లులు మంజూరు చేయక పోవడంతో మధ్యలోనే నిర్మాణాలు ఆగిపోతున్నాయి. దీంతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు వందల సంఖ్యలో కొత్త గృహాలు మంజూరు చేయాలని మండలంలో సుమారుగా 900 కొత్త దరఖాస్తులు లబ్ధిదారులు అందజేశారు.

గత ప్రభుత్వంలో అర్హులకు న్యాయం

వాస్తవంగా గత ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాయి. మండలంలో సుమారుగా 1200 పక్కా గృహాలను నిర్మించి పేదవానికి సొంతింటి కలను నిజం చేశారు. ఎప్పటికప్పుడు పింఛన్లు, నూతన రేషన్‌కార్డులు, రాయితీ రుణాలతో పాటు ఆరోగ్య శ్రీ, ఫీజురియింబర్స్‌మెంట్, రైతుల రుణమాఫీ, డ్వాక్రా రుణాల మాఫీ, వైఎస్సార్ చేయూత, డ్వాక్రా మహిళలకు పావలా వడ్డీకే రుణాలు, సున్నా వడ్డీకే రైతులకు వ్యవసాయ పెట్టుబడి రుణాలు మంజూరు చేసి అన్ని వర్గాల ప్రజల పక్షాన నిలిచారు. కానీ నేటి చంద్రబాబు పాలనలో అరకొరగా వారి సానుభూతిపరులకు పథకాలు అందించి చేతులు దులుపుకుంటున్నారు.

అట్టకెక్కిన రేషన్ కార్డులు, పింఛన్లు

ఇది ఇలా ఉంటే కొత్త రేషన్ కార్డుల కోసం గతేడాదిపైగా సుమారుగా మండలంలో 800 మంది కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు మండల వ్యాప్తంగా వందల సంఖ్యలో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా వీరిలో కొంత మంది వివరాలు మాత్రమే అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఎందుకంటే గ్రామాల్లోని తెలుగు తమ్ముళ్ల సిఫార్సులను తీసుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తూ అర్హులకు మెండిచెయ్యి చూపుతూ ప్రభుత్వ ఫలాలు అందకుండా చేస్తున్నారు. వాస్తవంగా గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న రెండు వారాల్లోని అర్హులను గుర్తించి అందజేశారు. నేడు కొత్తవి దేవుడెరుగు ఉన్న పింఛన్లను నెలనెలా తొలగించి పల్లెల్లో పేదవారిని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డుల విషయంలో తెలుగు తమ్ముళ్లకు నచ్చని దరఖాస్తుదారుల పేర్లపై కావాలనే ఆన్‌లైన్‌లో నాలుగు చక్రాల వాహనం, 30 ఎకరాలకు పైగా పొలం ఉన్నట్లు చూపిస్తూ అనర్హులగా తీసివేస్తున్నారు.

అరకొరగా పథకాలు అమలు:



కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందడం లేదు. ప్రభుత్వం మాటలకు చేతలకు చాలా తేడా ఉంది. తల్లికి వందనం, మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అరకొరగా అమలు కాగా 18 ఏళ్ల దాటిన మహిళలకు నెలకు రూ.1500 హామీ అటకెక్కింది. నిరుద్యోగభృతి వంటి హామీలను అమలు చేయకుండా నిరుద్యోగ యువతను, మహిళలను మోసం చేశారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి. – గుత్తికొండ కళ్యాణి, వైఎస్సార్ సీపీ మహిళా అధ్యక్షురాలు

రేషన్ కార్డుల జారీలో జాప్యం:



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయంలో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేశా. రెండు వారాల్లో రేషన్ కార్డు మంజూరు చేశారు. ఇటీవల నా ఇద్దరి పిల్లలను రేషన్ కార్డులో చేర్చేందుకు దరఖాస్తు చేశాను. నాకు పొలం ఎక్కువగా ఉందని ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేసి పిల్లల పేర్లు చేర్చకుండా దరఖాస్తును తిరస్కరించారు. రెండు నెలలు అవుతున్నా ఇంకా సవరణతో కూడిన కొత్త రేషన్ కార్డు మంజూరు చేయలేదు. – పచ్చవ వంశీకృష్ణ, పొన్నలూరు

వైద్య శిబిరాలపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రామాంజనేయులు

కొండపి: వైద్య శిబిరాలపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామాంజనేయులు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల కమిటీ సభ్యులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వస్థ్ నారీ.. స్వ శక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని అక్టోబర్ రెండు వరకు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్క మహిళ శిబిరంలో పాల్గొనే విధంగా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పెట్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ అధికారి డాక్టర్ ఐ.ప్రియాంక, ఏపీఎం బల్లికూర గోపీనాథ్, పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్, ఎంఈఓ సురేఖ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విక్టోరియా రాణి పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి

కనిగిరిరూరల్: విజయవాడలో జరుగుతున్న నిరుద్యోగ ఆవేదన సదస్సుకు కనిగిరి నియోజకవర్గం నుంచి ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువత బుధవారం వాహనాల్లో బయలుదేరారు. వాహన ర్యాలీని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతల రామారావు ప్రారంభించి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో నిరుద్యోగ, యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. నిరుద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. తక్షణం నిరుద్యోగులకు రూ. 3 వేలు నిరుద్యోగ భృతిని చెల్లించాలని, ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ నాయకులు పుట్టా సుబ్బారావు, సీహెచ్ పవన్‌కుమార్, మాచేపల్లి పూర్ణ చంద్రరాజు, చింతం రాము, ఖాశిం పీరా, మల్లెల ఫ్రాన్సిస్, చల్లగాలి రాజేష్, బాబు, రాగిపాటి సాయి, కమల్, నూకసాని ఆది, శ్రీరామ రాజమహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తిరుపతయ్య భౌతికకాయానికి దద్దాల నివాళి



తిరుపతయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ, నేతలు



వెంకటేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దద్దాల, నేతలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా నాయకురాలు పసుపులేటి దుర్గమ్మ భర్త తిరుపతయ్య మృతి చెందారు. తిరుపతయ్య భౌతిక కాయాన్ని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ బుధవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పసుపులేటి తిరుపతయ్య పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, సానికొమ్ము రంగనాయకులరెడ్డి, దేవకి రాజీవ్, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, అయిమల్ల నాగమణి, దరిశి సుబ్రహ్మణ్యం, బొట్టు శ్రీను, ఎస్కే సందాని, చింతలపూడి చెంచులు, తోటా అశోక్, బీవీ నారాయణ పాల్గొన్నారు.

పామూరు: వైఎస్సార్ సీపీ మహిళావిభాగం పట్టణ అధ్యక్షురాలు ఓరుగంటి పద్మ కుమారుడు ఓరుగంటి వెంకటేష్ దివదినకర్మకు వైఎస్సార్‌సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి హాజరయ్యారు. వెంకటేష్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. యాదాల వెంకటసాయికిరణ్, గట్లా విజయబాస్కర్‌రెడ్డి, ఓకేరెడ్డి, షేక్.గయాజ్‌బాషా, శ్రీరామ శ్రీనివాసులు, కటికల వెంకటరత్నం పాల్గొన్నారు.

పీసీపల్లి: చిరస్మరణీయుడు బొమ్మ కొండారెడ్డి అని వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండల పరిధిలోనే గుంటూరు లింగన్నపాలెం నాయకుడు బొమ్మ అంజిరెడ్డి తండ్రి బొమ్మ కొండారెడ్డి ఇటీవల మరణించగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఓకే రెడ్డి, గంగసాని హుసేన్‌రెడ్డి, పోలు జయరాం రెడ్డి, ఏరువ నరసింహ చౌదరి, నరాల కొండారెడ్డి, మూలె రాజశేఖర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- డీపీఓ వెంకటేశ్వరరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

పొన్నలూరు: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పొన్నలూరులో బుధవారం ఆయన పర్యటించి ప్రజలకు, పారిశుధ్య కార్మికులకు పలు అంశాలపై అవగాహన కల్పించి అనంతరం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్ర గ్రామాల కోసం క్షేత్రస్థాయి అధికారులు కృషి చేయాలన్నారు. పారిశుధ్య కార్మికుల ద్వారా సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేసి తడి చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేయాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త అనేది ఇంటి నుంచి వేరు చేసి సేకరించాలన్నారు. చెత్త సంపద తయారీ కేంద్రాల వద్ద తీగజాతి మొక్కలు విరివిగా నాటాలన్నారు. పరిశుభ్ర గ్రామాల కోసం ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. ఎంపీడీఓ సుజాత, ఈఓఆర్డీ సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి నారాయణ, మండవ ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న దంపతులు

మర్రిపూడి: మండలంలోని సన్నమూరులో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాముల వారి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గ్రామంలోని వీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. యజ్ఞ మహోత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొని పూజలు చేశారు. విశ్వబ్రహ్మణుల సంఘ అధ్యక్షుడు, నిర్మమహేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ సామంతపూడి నాగేశ్వరరావు మాట్లాడుతూ విశ్వకర్మ అంటే సృష్టికర్త అని, విశ్వకర్మ దైవిక వాస్తుశిల్పి, ఇంజినీర్ విశ్వాన్ని సృష్టించాడని పురాణాలు వివరిస్తున్నాయన్నారు. ఈదుమూడి గురుబ్రహ్మాచారి, ఈదుమూడి గోవిందయ్య, గురుబ్రహ్మం, నిమ్మల కనకరత్నాచారి, చోడ వెంకటేశ్వర్లు, శ్రీను, చిన్న శ్రీను, దత్తాత్రేయ, పాటి బాలయ్య, నరేంద్ర, గట్టుపల్లి సుబ్బరామయ్య, సన్నమూరు సుబ్బారావు పాల్గొన్నారు.

సీఎస్‌పురంలో మోస్తరు వర్షం



పీసీపల్లి పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న వర్షం నీరు



వర్షానికి రోడ్లపై పారుతున్న నీరు

సీఎస్‌పురం(పామూరు): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో బుధవారం మోస్తారు వర్షం కురిసింది. గత 5 రోజులుగా ఎండ, వేడి వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా బుధవారం కురిసిన వర్షానికి కొంత ఊరట చెందారు. కంది రైతులకు, నిమ్మ, బత్తాయి రైతులకు వర్షం ఊరటనిచ్చింది.

పీసీపల్లి: మండలంలో బుధవారం తెల్లవారుజామున మోస్తరు వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొర్లాయి. చిన్నచిన్న చెక్‌డ్యాంలు, కాలవలు నిండాయి. కొన్ని రోజులుగా వర్షాలు లేకపోవడంతో కంది ఎండుముఖం పట్టింది. ఈ క్రమంలో వర్షం మెట్టపైర్లకు జీవం పోసింది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసరాలపై పర్యవేక్షణ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా

హనుమంతునిపాడు: పౌర సరఫరాల నిత్యవసర సరుకులపై విజిలెన్స్ కమిటీ పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని తహసీల్దార్ షేక్ నాగూల్ మీరా అన్నారు. స్థాని రెవెన్యూ కార్యాలయంలో విజిలెన్స్ కమిటీ సభ్యులకు తహసీల్దార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సరఫరాల నిత్యావసర సరుకులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే మధ్యాహ్న భోజన నిర్వహణ, చిన్నారులకు అందించే పౌష్టికాహారంపై తప్పకుండా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఆర్ఐ కృష్ణచైతన్య, జూనియర్ అసిస్టెంట్ షేక్ రసూల్, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ, డీలర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఈ-మెయిల్



సీయంకు ఈ మెయిల్ పంపుతున్న ఉపాధ్యాయులు

సీఎస్‌పురం(పామూరు): సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చేపట్టిన నిరసనలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రికి సామూహికంగా ఈ మెయిల్ పంపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జేఎస్ ఆనంద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటుతున్నా ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్‌లీవ్, డీఏ బకాయిలు ఏవీ విడుదల కాలేదని ఆర్థికపరమైన సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులలో ఉన్న అసంతృప్తిని ప్రభుత్వం గుర్తించి పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాని కోరారు. నాయకులు దండే శ్రీనివాసులు, డి.సబ్బురాయుడు, కె.చెన్నయ్య, జి.రామక్రిష్ణ, యస్.గాంధీ, జి.సురేష్, బత్తుల రవీంద్ర, డి.శ్రీనివాసులు, కె.రామసుబ్బారావు, షేక్.మహ్మద్, సయ్యద్‌ఖాజా, రంహంతుల్లా, ఇండ్ల ప్రసాద్, ఎస్వీ నారాయణ, ఎలికా శ్రీనివాసులు, రవీంద్ర పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీలు

కనిగిరిరూరల్: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ దంతులూరి ప్రకాశం అధ్యక్షతన సాదాసీదాగా సాగింది. పలువురు సభ్యులను సమస్యలను ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని బడుగులేరులో జల్‌జీవన్ మిషన్ కింద వేసిన పైప్‌లైన్ కొన్ని గృహాల వరకే వేశారని, దీంతో గ్రామంలోని మిగతా ప్రజలు నీటి కోసం ఇక్కట్లు పడుతున్నట్లు ఎంపీటీసీ కోటమ్మ తెలిపారు. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గ్రాంట్ పూర్తిగా వచ్చిన వెంటనే గ్రామంలో పూర్తిగా పైప్‌లైన్ వేస్తామన్నారు. సర్పంచ్‌లు లోకిరెడ్డి అంకిరెడ్డి, మునగల బ్రహ్మరెడ్డిలు హౌసింగ్ కాలనీల మంజూరు చేయడం లేదని, విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం లేదని తెలిపారు. కోఆప్షన్ రహీం మాట్లాడుతూ కనిగిరి టు గార్లపేట రోడ్డులో క్వారీ డస్ట్‌లను రోడ్డుపైనే పడేస్తున్నారని, దీని వల్ల ప్రయాణీకులకు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు మార్జిన్లలో వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో అంతర్గత రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయని చిన్న ఇర్లపాడు పంచాయతీలోని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు మంజూరు చేయాలని సర్పంచ్ ముద్దా బాబు అడిగారు. లింగారెడ్డిపల్లి ఏరియాలోని విద్యుత్ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని కొందరు రైతులు ఫిర్యాదు చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, డీఎల్‌డీఓ శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ, తహసీల్దార్ ఏ రవిశంకర్, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, సీడీపీఓ సరోజని, ఏఈలు శ్రీకాంత్, ఎస్కే ఫిరోజ్, పవన్‌కుమార్, ఎంఈఓ డీవీ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆయాలకు కనీస వేతనం ఇవ్వాలి

కనిగిరిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కనీస వేతనం రూ.18,500 ఇవ్వాలని కోరుతూ ఆయాల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఎమ్మెల్యే ఉగ్రకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆయాలుగా పని చేస్తున్న వారికి రూ.6వేలు మాత్రమే ఇస్తున్నట్లు చెప్పారు. ఆయాలను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ 18, 500 ఇవ్వాలని, తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఆయాలకు నెలకు కనీసం రెండు సెలవులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ కక్ష్య సాధింపులు అరికట్టాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి జీపీ రామరావు, ఆయాల వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పుల్లమ్మ, రమణమ్మ, పాలపర్తి సుజాత, కె.మనోరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.343

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో బుధవారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కేజీ రూ.343 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1182 బేళ్లను బుధవారం వేలానికి తీసుకొచ్చారు. అందులో 934 బేళ్ల కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 248 బేళ్లను తిరస్కరించారు. సరాసరి ధర కేజీ రూ.199.93, కనిష్ట ధర కేజీ రూ.108గా నమోదైంది. వేలంలో 17 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి

కొండపి: కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం శక్తివంతంగా ఉంటుందని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ నాగమణి అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో స్వస్థ్ నారీ స్వ శక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనశైలి, స్వస్థత కోసం కొన్ని అంశాలను ఆమె రోగులకు వివరించారు. చక్కెర, వంట నూనెను 10 శాతం తగ్గిస్తే ఊబకాయాన్ని నివారించవచ్చన్నారు. సర్పంచ్ కొమ్ము సుశీల, రామయ్య, వైద్యులు నిఖిల్, వరుణ్, గీత, సిబ్బంది కిరణ్ పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా బహూకరణ

పీసీపల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడు ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అత్యాల ఏలియా బీరువాను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓలు శ్రీనివాసచారి, సంజీవ్‌లు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమన్నారు.

పోలేరమ్మ తల్లి ఆదాయం రూ.22.14 లక్షలు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి శ్రీ పోలేరమ్మ తల్లి దేవస్థానంలో బుధవారం నిర్వహించిన హుండీ లెక్కింపులో 22 లక్షల 14 వేల 935 రూపాయలు, వంద యూఎస్ డాలర్స్, 19.800 గ్రాముల బంగారం, 357 గ్రాముల వెండి ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వై.భైరాగి తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 17వ తేదీ వరకు హుండీ లెక్కించామని వల్లూరమ్మ తల్లి దేవస్థానం ఈఓ బి.రమేష్ వివరించారు. ఏపీజీబీ కామేపల్లి బ్రాంచ్ సిబ్బంది, సేవా సభ్యులు పాల్గొన్నారు.

గేదెకు కవల దూడలు



ఆవుకు పుట్టిన రెండు దూడలు

టంగుటూరు: మండల కేంద్రం టంగుటూరు గ్రామానికి చెందిన రావూరి మల్లికార్జున ప్రియ డెయిరీ ఫాంలో సాహివాల్ జాతికి చెందిన పాడి ఆవు కవల దూడలకు జన్మనిచ్చింది. చిన్నప్పటి నుంచి ఆవు నాలుగు ప్రసవాలు ఈనింది. నాలుగో కాన్పులో కవల పిల్లలు పుట్టాయి. ఒక మగ దూడ, ఒక ఆడ దూడ పుట్టగా రెండు దూడలు ఆరోగ్యకరంగా ఉన్నాయి. ఈ రకం ఆవు రోజుకు 16 లీటర్ల పాలు ఇస్తుంది. రెండు కవల దూడలు పుట్టడంతో గ్రామస్తులు ఆసక్తిగా చూస్తున్నారు.